# గులాబీ గూటికి.. మర్తన పేట గ్రామస్తులు

● కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు



వేములవాడ అభ్యర్థి లక్ష్మీనరసింహారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న మర్తనపేట బీజేపీ నాయకులు

కోనరావుపేట, అక్టోబర్ 28: కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామానికి చెందిన బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు జవ్వాజి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో 20మంది నాయకులు శనివారం వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చల్మెడ వారికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్‌తోనే సాధ్యమని, అందుకే బీఆర్ఎస్‌లో చేరుతున్నామని పార్టీలోచేరిన నాయకులు తెలిపారు. గడ్డం వెంకటేశ్, జవ్వాజి చంద్రయ్య, యేషా శ్రీనివాస్, యేషా మహేశ్, సుల్లం మల్లయ్య, దామరపెల్లి దేవరాజు, కలకోట విజయ్, ఓరగంటి సందీప్, పుల్లూరి వెంకటేశ్, కలకోట నరేశ్, కలకోట అజయ్, ఇరుమళ్ల నాగరాజ్, గొల్కొండ మోహన్‌రెడ్డి, తాళ్లపల్లి దుర్గయ్య, గొల్కొండ ఎల్లారెడ్డి, దొంగల లచ్చిరెడ్డి, ప్రసాద్ బీఆర్ఎస్‌లో చేరారు. చల్మెడకు మద్దతుగా ప్రచారం చేస్తూ, భారీ మెజార్టీ వచ్చేవిధంగా కృషి చేస్తామని వెల్లడించారు.

## చల్మెడ గెలువాలని మొక్కులు

వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు భారీ మెజార్టీతో గెలువాలని కోరుతూ మల్యాపేటకు చెందిన అడ్వొకేట్ జవ్వాజి ప్రసాద్‌గౌడ్ విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా చల్మెడ వాల్‌పోస్టర్ ప్రదర్శనతో అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు.



విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద చల్మెడ వాల్‌పోస్టర్‌తో జవ్వాజి ప్రసాద్‌గౌడ్

## రాజన్న ఆలయం మూసివేత



ఆలయ గర్భ గుడికి తాళం వేసిన అధికారులు

వేములవాడ టౌన్, అక్టోబర్ 28: రాహుగ్రస్త చంద్రగ్రహణం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయాన్ని శనివారం సాయంత్రం 4.15గంటల మూసివేశారు. అంతకు ముందు స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. రాజన్న ఆలయంతోపాటు అనుబంధ దేవాలయాలైన శ్రీ భీమేశ్వరాలయం, బద్ది పోచమ్మ, నగరేశ్వరాలయం, మహాలక్ష్మి ఆలయం, నాంపెల్లి నరసింహస్వామి ఆలయాన్ని కూడా మూసివేసినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. శనివారం రాత్రి 1.16 నుంచి రాత్రి 2.25 గంటల వరకు ఈ గ్రహణం ఉంటుందని చెప్పారు. గ్రహణం విడిచిన పిదప 29న ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ఉదయం 5గంటలకు ప్రాతఃకాల పూజ చేయనున్నట్లు తెలిపారు. తర్వాత 6గంటలకు భక్తుల దర్శనం ఉంటుందని అధికారులు చెప్పారు.

## ఎన్నికల ప్రశాంతతకు సహకరించాలి



రుద్రంగిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు, సీఐ, ఎస్ఐ, పోలీసులు

రుద్రంగి, అక్టోబర్ 28: రానున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ కోరారు. శనివారం రుద్రంగి మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో గ్రామంలోని ప్రధాన రహదారుల వెంబడి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామాల్లో ఎన్నికలు సజావుగా జరిగేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా నిఘా, పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. గత ఎన్నికల్లో అల్లర్లు, గొడవలు జరిగిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇప్పటికే పలువురిని బైండోవర్ చేశామని పేర్కొన్నారు. మద్యం, డబ్బుపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రాజేశ్, కేంద్ర సాయుధ బలగాల సీఐ నవీన్ వర్మ, కేంద్ర సాయుధ బలగాల సిబ్బందితో పాటు పోలీసులు పాల్గొన్నారు.

## స్వర్ణ కంకణం, అవార్డు ఎంపికైన పేరుక రాజు



పేరుక రాజు

చందుర్తి, అక్టోబర్ 28: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ విభాగంలో జూనియర్ అధికారి హోదాలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ పెరుక రాజు స్వర్ణకంకనం నంది పురస్కారం అవార్డుకు ఎంపికయ్యారు. తెలుగుతోపాటు వివిధ భాషల్లో కవిగా, రచయితగా అనువాదకుడిగా, గేయకుడిగా సాహిత్యంలో చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన 'స్వర్ణ కంకణం, నందిపురస్కారానికి ఎంపిక చేసినట్లు కళా సాంస్కృతిక అధ్యక్షుడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, హైదరాబాద్‌లో ఆదివారం జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. కాగా గ్రామానికి చెందిన పలువురు రాజు అవార్డుకు ఎంపికైన సందర్భంగా అభినందనలు వ్యక్తం చేశారు.

## పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12(డి) సమర్పించాలి

కలెక్టరేట్, అక్టోబర్ 28 : అత్యవసర సేవల్లో పనిచేస్తున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం నవంబరు 7వ తేదీలోగా నిర్ణీత ఫారం-12(డీ) భర్తీచేసి సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సంఘం ద్వారా మీడియా పాసులు కలిగిన జర్నలిస్టులకు కూడా ఈసారి ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎలక్షన్ కమిషన్ అనుమతించిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేందుకు వీలుపడని వారు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ ఫారం పొందడంలో, వినియోగించుకోవడంలో ఏమైనా సందేహాలుంటే జిల్లా సంక్షేమాధికారి, జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి లక్ష్మీరాజంను మొబైల్ నెంబర్ 94900 31615లో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

## వైభవంగా దేవదేవుల కల్యాణం

ముస్తాబాద్, అక్టోబర్ 28: మండల కేంద్రంలోని శ్రీశివకేశవ ఆలయాల్లో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీలక్ష్మీ పద్మావతివేంకటేశ్వరస్వామి, ఉమామహేశ్వరుల కల్యాణం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం పట్టణంలో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మహిళలు మంగళహారతులిచ్చారు. భక్తులు కట్నకానుకలు, ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ సర్పంచ్ గాండ్ల సుమతి, ఆలయ కమిటీ చైర్మన్ ఎలుసాని దేవయ్య, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

## వేలంలో దక్కించుకున్న చీరలు..!

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 28: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తంగళ్లపల్లి మండల కేంద్రంలో పరమేశ్వరీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో నిర్వహించిన అమ్మవారి చీరలు,కలశంను వేలంలో కురుమ సంఘ అధ్యక్షుడు ఎగుర్ల కనకరాజు రూ.1లక్షా6 వేలకు దక్కించుకున్నారు. శనివారం ఎంపీపీ పడిగెల మానస, తంగళ్లపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ కోడి అంతయ్య, ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి సమక్షంలో నిర్వాహకులకు నగదును కనకరాజు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటి అధ్యక్షుడు ఇటికల అశోక్, బీఆర్ఎస్ నేత నేరెల్ల అనిల్‌గౌడ్,ఎగుర్ల రాజు, దొండడి రాజు, పయ్యావుల శ్రీనివాస్, చిట్యాల అశోక్,బండి లవన్, తదితరులు ఉన్నారు.

## పకడ్బందీగా వాహనాల తనిఖీలు

గంభీరావుపేట, అక్టోబర్ 28: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా రాజన్న సిరిసిల్ల జిల్లా విచ్చేస్తున్న వాహనాలను పకడ్బందీగా తనిఖీలు చేస్తున్నామని ఎస్ఐ మహేశ్ అన్నారు. మండలంలోని జిల్లా సరిహద్దున పెద్దమ్మ స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును శనివారం ఎస్ఐ తనిఖీ చేశారు. మద్యం, డబ్బు అక్రమంగా రవాణా కాకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చెక్ పోస్టును ఏర్పాటు చేసుకుని పకడ్బందీగా తనిఖీలు చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.

## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

రుద్రంగి/గంభీరావుపేట, అక్టోబర్ 28: రుద్రంగి, గంభీరావుపేట మండల కేంద్రాల్లో బోయ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకికి జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాలకు నాయకులతో కలిసి బోయ వాల్మీకి సంఘం సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో బోయ వాల్మీకి సంఘం సభ్యులు లింగం, నర్సారెడ్డి, గంభీరావుపేట సర్పంచ్ శ్రీధర్, వార్డుసభ్యుడు లక్కిరెడ్డి రాజిరెడ్డి, సంఘం అధ్యక్షుడు బాలయ్య, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, నారాయణ, పెంటయ్య, సభ్యులు ఉన్నారు.

## నలుగురి పై కేసు నమోదు

వేములవాడ రూరల్, అక్టోబర్ 28 : వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతి పేర్కొన్నారు. ఎస్ఐ మారుతి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దూమాల అంజయ్య, రమేశ్ మధ్య తగాదా నెలకొనడంతో పాటు ఒకరిని ఒకరు దూషించుకోవడంతోపాటు ఘర్షణ పడ్డారు. దీంతో అంజయ్య, రమేశ్ ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంజయ్య, రమేశ్, తిరుపతి, దేవయ్యపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనాలని, ఎన్నికల సమయం కాబట్టి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇద్దరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 28: వీర్నపల్లి మండలం రంగంపేటకు చెందిన గుగులోత్ దేవ్‌సింగ్ తన టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తుండగా గొల్లపల్లి శివారులోని రెడ్డి మెస్‌వద్ద గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనం ఢీకొట్టగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. శనివారం దేవ్‌సింగ్ ప్రమాదంలో తీవ్రగాయాలపాలు కాగా క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. దేవ్‌సింగ్ తమ్ముడు గుగులోత్ రాజు ఠాణాలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ చెప్పారు.

## విద్యార్థులకు అవగాహన

కోనరావుపేట, అక్టోబర్ 28: మండలంలోని మర్రిమడ్ల, కేజీబీవీ, మోడల్ స్కూల్ పాఠశాలలో విద్యార్థులకు ఏఎన్ఎం ప్రమీల అవగాహన కల్పించారు. విద్యార్థినులు జాగ్రత్తగా వ్యవహరిస్తూ పురోగతిని సాధించాలన్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

# పరిశోధన పై జిజ్ఞాస పెంపొందించుకోవాలి




ఎస్సారార్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సతీశ్‌ను సన్మానిస్తున్న అగ్రహారం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వేములవాడ రూరల్, అక్టోబర్ 28 : సమాజం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించేందుకు విద్యార్థులు పరిశోధనపై జిజ్ఞాస పెంపొందించుకోవాలని కరీంనగర్ ఎస్సారార్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం వేములవాడ మండలం అగ్రహారం ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో జిజ్ఞాస, పరిశోధన కమిటీలు సంయుక్తంగా జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కరీంనగర్ ఎస్సారార్ కళాశాల సహాయ ఆచార్యుడు సతీశ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ఒక అధ్యయన అంశంగా ఎంచుకొని పరిశోధన చేసి పరిష్కారం మార్గాన్ని చూపాలన్నారు. స్టడీ ప్రాజెక్టుల రూపకల్పనకు పాటించాల్సిన పరిశోధన ప్రక్రియ, రిపోర్టు తయారీ వంటి విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రూపుల విద్యార్థులు స్టడీ ప్రాజెక్టులను రూపొందించి రాష్ట్రస్థాయికి సమర్పిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిశోధన కమిటీ సమన్వయకర్త అఫ్సరీ ఉస్మానీ, మల్లారెడ్డి, రమాదేవి, ప్రభాకర్, రాజేశ్, శ్రీనివాసులు, కరుణ పాల్గొన్నారు.